తెలుగు డిజిటల్ దినపత్రిక

# సిరి

...People Voice | www.siridaily.com

శనివారం, అక్టోబర్ 18, 2025 | సంపుటి-1 సంచిక-306 పేజీలు-12

The Largest Readers Local Digital Daily





# లక్షల్లో ఫీజులు.. కనిపించని వసతులు !

## ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యం-2

2

- ఆట స్థలాలు లేవు..ఆటలు కానరావు
- పుట్టగొడుగుల్లా ప్రైవేటు పాఠశాలలు
- అర్హత లేనివారితో బోధన
- విద్యాశాఖను శాసిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు
- ప్రైవేట్‌పై అధికారుల ఉదాసీనత

ప్రైవేటు పాఠశాలల్లో సరైన వసతులు కరువు..అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు కానరారు.. ఒక్కో తరగతి గదిలో 60 నుంచి 80 మంది వరకు విద్యార్థులకు బోధన... సరైన ఆటస్థలాలు కనిపించవు... అద్దె భవనాల్లో పాఠశాలలు నిర్వహణ.. తక్కువ వేతనాలకు అనుభవం లేని ఉపాద్యాయులతో బోధన..వెరసి ప్రైవేట్ పాఠశాలల అరాచకాలు..అనేక ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ల సమయంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారు. విద్యార్థులకు కనీస వసతులు లేకుండా పాఠశాలలను కొనసాగిస్తున్నారు. పాఠశాలల్లో వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులపై దృష్టి సారించాల్సిన విద్యాశాఖ నిద్రమత్తులో కొనసాగుతుంది. ప్రైవేట్ ఇష్టారాజ్యంపై సిరి కథనం..

- (జి.పరంజ్యోతి)
(సంగారెడ్డి ప్రతినిధి-సిరిన్యూస్)

# విశ్లేషణాత్మకంగా చదివితేనే ఉన్నత శిఖరాలు చేరవచ్చు

- సివిల్ సర్వీస్ అనేది కేవలం పరీక్ష మాత్రమే కాదు
- దేశ సేవకు దారి తీసే సదఅవకాశము
- విద్యార్థి ఎప్పుడూ ప్రశ్నించేవాడిగా కొత్త దారులు అన్వేషించాలి
- జేఎన్టీయూ కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్
- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

5




# నేలరాలుతున్న తెల్ల బంగారం !

- పత్తి రైతు పరిస్థితి ఆగమ్యగోచరం
- భారీ వర్షాలతో పంట నష్టం
- మరోవైపు పత్తి ఏరేందుకు కూలీల కొరత
- పెట్టబడి కూడా దక్కేలా లేదు...
- నియోజకవర్గంలో 10 వేలకు పైగా ఎకరాల్లో సాగు

పత్తి రైతులకు విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికందే వరకు ఏదో రకంగా కష్టాలు తప్పడం లేదు. పత్తి పంటపై అతి వర్షాల ప్రభావం, వన్యప్రాణుల దాడులు.. దిగుబడులపై వెంటాడుతున్న దిగులుతో పత్తి రైతు ఆవేదనలో మునుగుతున్నాడు...కష్టపడి పండించిన పత్తిని తీసేందుకు కావలసిన కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో తెల్ల బంగారం నేలరాలి పోతుంది...కూలీలకు అధిక డబ్బులు వెచ్చించినా దొరకని పరిస్థితులు నెలకొనడంతో రైతులు తీవ్రంగా నిరాశ చెందుతున్నారు. దీంతో పత్తి ఏరేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు.

- (బోయిని వెంకటరాములు)
నారాయణఖేడ్-సిరిన్యూస్

వివరాలు 3లో










# లక్షల్లో ఫీజులు..
# కనిపించని వసతులు !

## ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యం - 2

**ప్రైవేటు పాఠశాలల్లో సరైన వసతులు కరువు..అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు కానరారు.. ఒక్కో తరగతి గదిలో 60 నుంచి 80 మంది వరకు విద్యార్థులకు బోధన... సరైన ఆటస్థలాలు కనిపించవు... అద్దె భవనాల్లో పాఠశాలలు నిర్వహణ.. తక్కువ వేతనాలకు అనుభవం లేని ఉపాధ్యాయులతో బోధన..వెరసి ప్రైవేట్ పాఠశాలల అరాచకాలు..అనేక ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ల సమయంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారు. విద్యార్థులకు కనీస వసతులు లేకుండా పాఠశాలలను కొనసాగిస్తున్నారు. పాఠశాలల్లో వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులపై దృష్టి సారించాల్సిన విద్యాశాఖ నిద్రమత్తులో కొనసాగుతుంది. ప్రైవేట్ ఇష్టారాజ్యంపై సిరి కథనం..**

- (జి.పరంజ్యోతి)
(సంగారెడ్డి ప్రతినిధి-సిరిన్యూస్)

### ఫీజులు ఫుల్...సౌకర్యాలు నిల్...

సంగారెడ్డి జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో ఉండాల్సిన కనీస సౌకర్యాలు లేవు. కానీ కార్పోరేట్ పాఠశాలల పేరుతో రూ.50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. సంగారెడ్డి పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలు అయిన పటాన్ చేరు, అమాన్పూర్, ఆర్ సి పురం, తెల్లాపూర్, మండలాల్ లోని పలు ప్రైవేటు పాఠశాలల్లో బహుళ అంతస్తులలో, అపార్ట్మెంట్లలో, నివాస ఆవాసాల మధ్య, షాపింగ్ కాంప్లెక్స్ ల పైన, సెకండ్ ఫ్లోర్ థర్డ్ ఫ్లోర్ లో పాఠశాలలను నడిపిస్తున్నారు, వాటికి సరియిన గ్రౌండ్ గాని, పార్కింగ్ గాని, పిల్లలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి సరైన వసతులు గాని, లంచ్ చేయడానికి స్థలాలు కానీ, సాయంకాల వేళ ఆడుకోవడానికి ఆట స్థలాలు గాని లేని పలు పాఠశాలలకు లేవు. సెలార్లో ఆటలు, మధ్యాహ్నం వేల మధ్యాహ్న భోజనం, ఉదయం జరిగే పాఠశాల అసెంబ్లీ సైతం సెలార్లలో నిర్వహించడం విద్యాశాఖ ఉదాసీనతకు నిదర్శనం. పేరుపొందిన పలు ప్రైవేట్ విద్యాసంస్థలు స్కూల్‌వన్ స్కూల్‌టు తో బ్రాంచ్‌లను ఓపెన్ చేసి యధేచ్ఛగా విద్యా వ్యాపారాన్ని నడిపించుకుంటున్నారు. ఒకానొక సమయంలో ప్రైవేటు పాఠశాలలో లోపల జరిగిన విషయంలో ఎంఈఓ ను సైతం లోపలికి అనుమతి ఇవ్వలేదంటే పరిస్థితి ఎలా చేజారుతుందో అర్థం చేసుకోవాలి.

### అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన...

అనేక ప్రైవేటు పాఠశాలల్లో సరైన వసతులు కల్పించడం లేదు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం లేదు. ఒక్కో తరగతి గదిలో 60 నుంచి 80 మం ది వరకు విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. సరైన ఆటస్థలాలు ఉండడంలేదు. అద్దె భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. తక్కువ వేతనాలకు అనుభవం లేని ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలను కొనసాగిస్తున్నారు. పాఠశాలల్లో వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తదితర వాటిపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రైవేట్‌గా అధికారుల కుమ్మక్కు...

పేరుకు కార్పొరేట్ పాఠశాలలు. కానీ విద్యార్థులు ఆడుకోవడానికి కావాల్సిన ఆట స్థలాలు, మంచినీటి సౌకర్యం, రవాణా, సరైన తరగతి గదులు ఉండవు. పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని ఆట స్థలంగా అధికారులకు చూపిస్తూ, ఇరుకు గదుల్లో పరిమితికి మించి విద్యార్థులకు బోధన చేస్తున్నారు. జిల్లా అధికారులతో నేరుగా సంబంధాలు పెట్టుకుని కార్పొరేట్ స్థాయి పాఠశాలలు స్థానిక అధికారులు ఇచ్చిన నోటీసులను ఏ మాత్రం ఖాతరు చేయకుండా అడ్మిషన్లను కొనసాగిస్తున్నారు. జిల్లా అధికారుల కనుసన్నలలోనే వసతులు లేని పాఠశాలలు కొనసాగుతున్నాయని, వారి అండతోనే ఎలాంటి సౌకర్యాలు లేని పాఠశాలలు వేలల్లో ఫీజులు దండుకుంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

### విద్యాశాఖ అధికారుల ఉదాసీనత..

అరకొర వసతులతో ప్రైవేట్ పాఠశాలలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నా విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు కఠినంగా వ్యవహరిస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులుండవని పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొంటున్నారు. కనీస వసతులు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోయింది. వ్యాపార దోరణితో యాజమాన్యాలు వ్యవహరిస్తుండడంతో సామాన్యుడికి ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతున్నది. ఎంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువునకే ఖర్చు అవుతుండడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ప్రైవేటు కార్పొరేటు విద్యా సంస్థల్లోనే చదివించాలంటేనే జంకుతున్నారు. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నాయి. తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పాఠశాలల్లో ఫీజులకు తోడు యూనిఫామ్‌లు, పుక్తకాలు, నోటుబుక్కులు, బస్సు ఫీజులు అంటూ వసూలు చేస్తున్నారు. విద్యా సంస్థలు ప్రారంభం అవుతుందంటే చాలు తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. కొంత మంది వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి పిల్లలను చదివిస్తూ అప్పుల పాలవుతున్నారు.

### పుట్టగొడుగుల్లా ప్రైవేటు పాఠశాలలు...

విస్తరిస్తున్న కాలనీలకు అనుగుణంగా కొత్త పాఠశాలలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. కొత్త పాఠశాలల్లో కార్పోరేట్ విద్యనం దిస్తామని విద్యార్థులను ప్రలోభాలకు గురిచేస్తూ ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, డ్రెస్సు లు, ట్రాన్స్‌ఫోర్టుల పేరుతో ఒకొక్కరి నుంచి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు విద్యావ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అడ్డుకట్ట వేయ డం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో టాలెంట్, టెక్నో, యూటెక్నో, డీజీ, ఒలంపియా, ఐఐటీ, జేఈ, మాడల్ స్కూల్స్, కంప్యూటర్, స్పోర్ట్స్, డిజిటల్ తదితర ఆకర్షణీయమైన కోర్సుల పేర్లు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. యాజమాన్యాలు నిర్ణయించిన మేరకే ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.






# నేలరాలుతున్న తెల్ల బంగారం !

- పత్తి రైతు పరిస్థితి అగమ్యగోచరం
- భారీ వర్షాలతో పంట నష్టం
- మరోవైపు పత్తి ఏరేందుకు కూలీల కొరత
- పెట్టబడి కూడా దక్కేలా లేదు...
- నియోజకవర్గంలో 10 వేలకు పైగా ఎకరాల్లో సాగు

పత్తి రైతులకు విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికందే వరకు ఏదో రకంగా కష్టాలు తప్పడం లేదు. పత్తి పంటపై అతి వర్షాల ప్రభావం, వన్యప్రాణుల దాడులు.. దిగుబడులపై వెంటాడుతున్న దిగులుతో పత్తి రైతు ఆవేదనలో మునుగుతున్నాడు...కష్టపడి పండించిన పత్తిని తీసేందుకు కావలసిన కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో తెల్ల బంగారం నేలరాలి పోతుంది...కూలీలకు అధిక డబ్బులు వెచ్చించినా దొరకని పరిస్థితులు నెలకొనడంతో రైతులు తీవ్రంగా నిరాశ చెందుతున్నారు. దీంతో పత్తి ఏరేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు.

- (బోయిని వెంకటరాములు)
నారాయణఖేడ్-సిరిన్యూస్







**ఒక తెంపుతోనే సరి...**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు సాగుచేసిన పంటలు తీవ్రస్థాయిలో నష్టపోయారు. సాధారణంగా పత్తి పంట రెండు మూడు పర్యాయాలు వచ్చేది. కానీ ఈసారి వర్షాభావంతో ఒక తెంపుతూనే పంట సరిపెట్టుకోవాల్సి వస్తుందని రైతులు పేర్కొన్నారు. వచ్చిన పంట కూడా బరువు చాలా తక్కువగా వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పత్తి ఏరేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు.

నారాయణఖేడ్ నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. మిగతా ఇతర పంటలను సాగు చేస్తున్నారు. పత్తి తీసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ సమయానికి కూలీలు దొరకకపోవడంతో పత్తి నేలరాలి పోతుంది. దీంతో నష్టాల పాలవుతున్నారు. రైతు పండించిన పంటలకు యంత్రాల వాడకం పెరిగిన మరికొన్ని పంటలకు మాత్రం కూలీనే దిక్కు అవుతున్నారు. కూలీలు దొరికేంతవరకు పంటను పొలంలోనే ఉంచక తప్పడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిసర గ్రామాల్లో పత్తితీతకు కూలీలు దొరకకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి రైతులను తీసుకువస్తున్నారు. పని ప్రదేశం వద్దకు వచ్చేందుకు కూలీలకు ప్రత్యేకంగా రవాణా సదుపాయాన్ని కూడా రైతులే ఏర్పాటు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలకు గ్రామాలకు తీసుకొొచ్చి సౌకర్యాలను రైతులే కల్పిస్తున్నారు. దీంతో కూలీలకు ఎంత డిమాండ్ పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో పత్తి ఏరేందుకు కేజీ రూ.10 నుంచి రూ.12 తీసుకుంటున్నట్లు రైతులు తెలిపారు.

## ఒకవైపు అతివృష్టి..

ఒకవైపు అతివృష్టి...మరోవైపు పంటపై వన్యప్రాణుల దాడులు వెరిసి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వ్యవసాయమే జీవనాధారమైన రైతులకు అప్పులు చేసి ఇంటిల్లిపాది చేలల్లో కష్టపడుతూ సాగు పనుల్లో మునిగితే పంటలను వెంటాడుతున్న వాతావరణం, అడవి పందులు, కోతుల బెడద దిగుబడులపై తీవ్ర ప్రభావం పడి అప్పుల్లో కూరుకు పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణ ఖేడ్, మనూర్, నిజాంపేట్, నాగల్ గిద్ద, సిర్గాపూర్, కల్హేర్, కంగ్టి మండలాల్లో రైతులు ఈ ఖరీఫ్లో దాదాపు పదివేల ఎకరాలలో పత్తి పంట సాగు చేసినట్టు అంచనా వేశారు. ఈ ప్రాంత రైతులు వరి పంటతో పాటుగా పత్తి పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. యధావిధిగా వేసవి దుక్కులు దున్ని కాలం కోసం ఎదురుచూసిన రైతులు తొలకరి వానతో వ్యక్తులు విత్తుకున్నారు. కాలం ఆరంభం జూన్ జూలై మాసాల్లో కురిసిన అనుకూల వర్షాలకు పంట పచ్చగా ఎదిగి రావడంతో రైతులు ఆనందపడ్డారు. అది ఎంతో కాలం లేకుండా పోయింది. ఆ తర్వాత ఆగస్టు మాసం నుండి కురిసిన ఆతి భారీ వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. పూత కాత దశలో ఉన్న పంటపై ప్రభావితమయ్యాయి.

## వన్యప్రాణులతో పంట నేలపాలు..

పలు గ్రామాల్లోని పంటలను కాండం కాయ తలుచ పురుగు ఆశించడం చేలల్లో నీరు చేరి ఎరుపు రంగులోకి మారడం, పూత జారిపోవడం, కాయ నేలరాలడం, పగిలిపోవడం, గడ్డి విపరీతంగా పెరగడం తదితర సమస్యలు పంటలను బాధిస్తున్నాయి. పంటలపై వన్యప్రాణుల దాడి, ఒకవైపు అతివృష్టి పంటను వేధిస్తుంటే మరోవైపు వాతావరణ పరిస్థితులను తట్టుకొని ఎదిగిన పంటలను వన్యప్రాణుల బెడద వేధిస్తోంది. రాత్రిళ్ళు అడవి పందులు, కోతులు పంటలోకి చేరి పత్తి కాయలను తినడం కొరికి వేయడం లాంటి చర్యలతో పంట నేలరాలుతుందని రైతులు వాపోతున్నారు. కొంతమంది పంట చుట్టూ సోలార్ పెన్సిల్ వేసిన పంటలో చప్పుడు చేసి పరికరాలు ఏర్పాటు చేసి శబ్దాలు చేస్తున్నా అవి ఫలితాలు ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. పొద్దంతా పంటలకు మందులు పిచికారి గడ్డి ఏరడం పంటను కాపాడుకునే పనుల్లో నిమగ్నం అయితే రాత్రి వన్యప్రాణుల దాడులు నుండి పంటను దక్కించుకునే ప్రయత్నం ఇలా ఒక యుద్ధమే చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దిగుబడులపై సన్నగిల్లిన ఆశలు...

ఈయేడు అతి వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు వేరసి పత్తి పంటలపై ప్రభావం చూపడంతో పంటల దిగుబడులపై ఆశలు వదులుకున్నామని మెజార్టీ రైతులు అంటున్నారు. పంట కాలం ముగింపు సమీపించిన పత్తి చెట్టుకు మామూలుగా 150 పైగా కాయలు ఉండాల్సి ఉండగా ఆ పరిస్థితులు లేవని అంటున్నారు. పంటలను దక్కించుకునేందుకు మందులు మోతాదు మించి వాడాల్సి వస్తోందని కలుపుతీయుట ఇతర వ్యవసాయ పనుల కోసం మరల కూలీలను పెట్టాల్సి వస్తుందని అయినా కూలీలు సమయానికి దొరకడం లేదని డబ్బులు అధికంగా డిమాండ్ చేస్తున్నారని అయినా చెల్లించాల్సి వస్తుందని దాంతో అప్పులు చేసి పంటలకు పెట్టుబడులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పంటల పరిస్థితులపై సర్వే జరిపించి నిర్ధారణ చేయాలని మార్కెట్ ధర పెంచాలని రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

**కూలీలు దొరకడం లేదు...**
**మల్గొండ, రైతు, ర్యాకల్**



గ్రామాల్లో పత్తితీతకు కూలీలు దొరకడం లేదు. నేను 5 ఎకరాలు పత్తి పంటను సాగు చేయడం జరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట దెబ్బతిని దిగుబడి లేదు. ప్రస్తుతం పత్తి ఏరేందుకు దూర ప్రాంతాల నుంచి కూలీలను ఆటోలో తీసుకురావడం జరుగుతోంది. కూలీల కొరత తీవ్ర స్థాయిలో ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

**వర్షాలకు పంట దెబ్బతింది...**
**బోయిని బసవరాజ్, రైతు, తుర్కపల్లి**



నేను 20 ఎకరాల్లో కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశాను. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట మొత్తం ఎర్రగా మారి పత్తి పిందెలు తక్కువగా అయ్యాయి. ఉన్న పంటనే ఏరేందుకు సిద్ధంగా ఉన్న కూలీలు రాకపోవడంతో అదికాస్త నేల రాలుతోంది. గత సంవత్సరం కూడా ఇతర ప్రాంతాల నుంచి కూలీలతో పత్తిని తీయించడం జరిగింది.

పత్తి రైతును ఆదుకోవాలి...
బోయిని సత్యవ్వ, మహిళా రైతు



పత్తి రైతును ప్రభుత్వమే ఆదుకోవాలి. పెట్టిన పెట్టుబడులు కూడా దక్కేలా లేదు. ఉన్న పంటకైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.







# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- తాడ్దాన్ పల్లి, సుల్తాన్పూర్ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక సందర్శన
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి
- తాడ్దాన్ పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు పరిశీలన
- జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్):** ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్నం భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం చౌటకూర్ మండలం తాడ్దాన్ పల్లి, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేద్రంను సుల్తాన్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి చదువు, ప్రతిభాస్థాయిని తెలుసుకున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. రోజూ విద్యార్థులకి స్పెషల్ క్లాసులు చెప్తున్నారా అని, సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పోషకాహార సమస్యల పరిష్కారం కోసం నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సుల్తాన్పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు . పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోజు సాయంత్రం విద్యార్థులకి స్పెషల్ క్లాసులు చెప్తున్నారా అని, సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు అందరూ ఇప్పటి నుండే వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు.

### - ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. శుక్రవారం చౌటకూర్ మండలం తాడ్దాన్ పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులకు ఇసుక కొరత రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం స్థాయిని బట్టి వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, నిర్మాణంలో ఉన్న ఇండ్లు ఏఏదశలో ఉన్నాయనిఅధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్లాబ్ దశ వరకు పూర్తి అయినా ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని, ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ పాండు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ సర్కారు పత్రికా స్వేచ్ఛను కాలరాస్తోంది

- సాక్షిపై, ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై కేసులు, వేధింపులకు నిరసనగా
- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద జర్నలిస్టు సంఘాల ధర్నా
- అధనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేత
- జిల్లాలో పలుచోట్ల జర్నలిస్టు సంఘాల నిరసనలు
- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు యాధగిరి విమర్శ



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి మీడియాపై, ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డిపై అక్కడ పోలీసులు నమోదు చేస్తున్న అక్రమ కేసులను నిరసిస్తూ శుక్రవారం జిల్లాలో పలుచోట జర్నలిస్టు సంఘాలు నిరసన కార్యాక్రమాలు చేపట్టాయి. నోటీసుల పేరుతో ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డిని పోలీసులు వేధింపులకు గురి చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు, పలురాజకీయ పార్టీల నేతలు నిరసన తెలిపారు. సంగారెడ్డిలో పలు జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ ముందు ధర్నా, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న ఏపీ సర్కారు తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నోటీసుల పేరుతో అక్కడి పోలీసులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారి యాధగిరి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎత్తి చూపుతున్న సాక్షి మీడియాను ఏపీలోని చంద్రబాబు సర్కారు అణిచి వేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. 'సాక్షి'పై, ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డిపై అక్రమ కేసులు కేసులు పెడుతున్నారని విమర్శించారు. నోటీసుల పేరుతో అక్కడి పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ప్రజాస్వామ్య వాదులందరు ఖండిస్తున్నారని పేర్కొన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛపై జరుగతున్న దాడిగానే భావిస్తున్నామని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మీడియాను కట్టడి చేసేందుకు తప్పుడు కేసులు పెడుతూ జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం ఏమాత్రం సరికాదని అన్నారు. చంద్రబాబు సర్కారు తన తీరు మార్చుకోని పక్షంలో జర్నలిస్టులు తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు అనీల్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు పానుగంటి కృష్ణ, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ (టెంజు) జిల్లా అధ్యక్షుడు అక్కపల్లి యోగానందరెడ్డి, టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.శ్రీధర్‌గౌడ్, కందిలి ఎడిటర్ సురకంటి రాజేందర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు శివ, కాకోల్ల నాగరాజు, నాగేష్‌గౌడ్, శివశంకర్‌రావు, సాయినాథ్, వీరేందర్, అన్వర్, విల్సన్, పరంజ్యోతి, ఈశ్వర్, రాజు, విజయ్‌రావు, యాధగిరి, సాక్షి బ్యూరోఇన్‌చార్జి పి.బాలప్రసాద్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివప్రసాద్, రిపోర్టర్లు రాజశేఖర్, రామలింగుబాలయ్య, ఆంజనేయులు, వెంకటేశం, నర్సింలు, ప్రశాంత్‌గౌడ్, నర్సింలు, శ్రీనాథ్, వేణు, నగేష్, నవాజ్, సాక్షి టీవీ రిపోర్టర్లు మహేష్, ప్రదీప్, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.





# విశ్లేషణాత్మకంగా చదివితేనే ఉన్నత శిఖరాలు చేరవచ్చు




- సివిల్ సర్వీస్ అనేది కేవలం పరీక్ష మాత్రమే కాదు
- దేశ సేవకు దారి తీసే సదవకాశము
- విద్యార్థి ఎప్పుడూ ప్రశ్నించేవాడిగా, కొత్త దారులు అన్వేషించాలి
- జేఎన్టీయూ కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్
- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్):** విద్యార్థులు విశ్లేషణాత్మకంగా, ఆలోచనాత్మకంగా చదువుకుంటేనే ఉన్నతమైన లక్ష్యాలను సాధించగలరని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. శుక్రవారం సుల్తాన్పూర్‌లోని జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రధాన అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సివిల్ సర్వీస్ అనేది కేవలం పరీక్ష మాత్రమే కాదు, అది దేశ సేవకు దారి తీసే అవకాశమూ. అందుకే విద్యార్థులు ఈ పరీక్షలకు సన్నద్ధం కావడంలో క్రమశిక్షణ, పట్టుదల, సమయ పాలన వంటి అంశాలను అలవాటు చేసుకోవాలి అని సూచించారు. విద్యార్థులకు యూపీఎస్సీ, సివిల్ సర్వీసుల పరీక్షా విధానం, పేపర్ నమూనా, సబ్జెక్టుల ఎంపిక, సమాధానాల రాయడం వంటి అంశాలపై విపులంగా వివరించారు. సాధారణ అవగాహనతో పాటు సమకాలీన అంశాలపై అవగాహన పెంపు అవసరమని చెప్పారు. విశ్లేషణాత్మక ఆలోచనతో చదివే విద్యార్థి ఎప్పుడూ ప్రశ్నించేవాడిగా, కొత్త దారులు అన్వేషించేవాడిగా ఉండాలి అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పరీక్షల కోసం కాకుండా ప్రతి సబ్జెక్టును లోతుగా, విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. లక్ష్య నిర్దేశం ఉన్నవారికి కష్టపడి చదవడమే విజయానికి మూలాధారం. మీరు ఏ రంగంలో ఉన్నా, సరైన ప్రణాళికతో, నిరంతర కృషితో ముందుకు సాగితే సివిల్ సర్వీసులు వంటి అత్యున్నత ఉద్యోగాలను సాధించడం సాధ్యమే అని అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సహజంగా ఉండే విశ్లేషణాత్మకతను మరింత మెరుగుపరచుకుంటే, వారు యూపీఎస్సీ, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల్లో కూడా రాణించగలరని కలెక్టర్ హితవు పలికారు. విద్యార్థులు తమ మేధస్సును సృజనాత్మక దిశలో వినియోగించుకుంటే అనేక అవకాశాలు ఎదురవుతాయని వివరించారు. తన ప్రసంగంలో ఆమె గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న తేడాలు విద్యార్థుల లక్ష్యసాధనకు అడ్డంకిగా భావించవద్దని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ కాలంలో ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు ఉన్నాయి. పట్టుదలతో, క్రమశిక్షణతో కృషి చేస్తే గ్రామీణ విద్యార్థులు కూడా ఉన్నతస్థాయికి చేరవచ్చు అని ఆమె ప్రోత్సహించారు. కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సివిల్ సర్వీసులు, యూపీఎస్సీ, గ్రూప్ పరీక్షల గురించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సవివరంగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ పాండు, జేఎన్టీయూ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేప పిల్లలు విడుదలకు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్):** జిల్లాలో చేపల ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని నీటిమనరులైన చెరువులో కుంటలు ప్రాజెక్టులలో చేప పిల్లలు విడుదలకు చేయాల్సిన ఏర్పాట్లపై సన్నాహాక సమావేశం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్ర శేఖర్, మత్స్యశాఖ అధికారి మధుసూదన్, నీటి పారుదలశాఖ అధికారి జనార్దన్, డిపిఓ సాయిబాబా లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ చేప పిల్లల విడుదల ద్వారా మత్స్యకారులకు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు వారి జీవన వారి జీవన విధానం బలోపేతం అవుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 1025 సీజనల్ చెరువులు, అలాగే 79 దీర్ఘకాలంగా నీరు నిల్వ ఉండే చెరువులు ఉన్నాయని, వీటిలో సింగూరు ప్రాజెక్టు, సదాశివపేట మండలం, తంగడపల్లి నీలగిరి ప్రాజెక్టులు, నారాయణఖేడ్ డివిజన్, పరిధిలోని సిర్గాపూర్ మండలం లోని నల్లవాగు ప్రాజెక్టులలో చేప పిల్లల విడుదలకు అనుకూలమైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. చేప పిల్లల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. మత్స్యశాఖ అధికారులు క్వాలిటీ చెక్ ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన చేప పిల్లలే చెరువుల్లో విడుదల చేయాలన్నారు. ఎంపీడీవోలు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, ప్రతి పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించి ఈ కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ మత్స్యశాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మత్స్యశాఖ అధికారులకు సమన్వయం, రికార్డు నిర్వహణ, చెరువుల ఎంపిక, నీటి స్థాయిల పరిశీలన, విత్తనాల నాణ్యత వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అధికారులు సమగ్ర ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. చేప పిల్లల విడుదల కార్యక్రమం, పారదర్శకంగా ఉండేలా మత్స్యకారుల సంఘాల సమక్షంలోనే చేప పిల్లలు నీటి వనరులలో విడుదల చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.





## ఉత్సాహభరితంగా స్కూల్ గేమ్స్

# ఫెడరేషన్ క్రీడోత్సవాలు

- అలరించిన క్యాంపు ఫైర్
- డ్యాన్సులతో అలరించిన క్రీడాకారులు
- ముగిసిన క్వాలిఫైయింగ్ మ్యాచులు
- శనివారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచులు
- తీన్మార్ డాన్స్ స్టెప్పులతో ఉర్రూతలూగించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్ చెరు, అక్టోబర్ 17, (సిరి న్యూస్):** పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సౌజన్యంతో పటాన్ చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్ వేదికగా కొనసాగుతున్న 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు రెండవ రోజు ఉత్సాహ భరితమైన వాతావరణంలో కొనసాగాయి. రెండవ రోజు వివిధ జిల్లాల మధ్య కబడ్డీ వాలీబాల్ పోటీలలో క్వాలి ఫైయంగ్ మ్యాచ్ లు ముగిసాయి. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు నిరంతరాయంగా పోటీలు కొనసాగాయి. అండర్ 14 కబడ్డీ బాలుర విభాగంలో మెదక్, మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డి, బాలికల విభాగంలో నల్గొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్ జట్లు సెమీఫైనల్ కి అర్హత సాధించాయి. వాలీబాల్ అండర్ 17 బాలుర విభాగంలో ఖమ్మం, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జట్లు సెమీఫైనల్ కి అర్హత సాధించాయి

**తీన్మార్ డాన్స్ స్టెప్పులతో ఉర్రూతలూగించిన ఎమ్మెల్యే జిఎంఆర్ అలరించిన క్యాంపు ఫైర్**

క్రీడాకారులను ఉత్సాహ పరిచేందుకు శుక్రవారం రాత్రి మైత్రి మైదానంలో క్యాంపు ఫైర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల క్రీడాకారులు తమ డాన్సులతో అందరినీ అలరించారు. పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తీన్మార్ స్టెప్పులు వేసి అందరినీ ఉత్సాహ పరిచారు. శనివారం సెమీఫైనల్ తో పాటు ఫైనల్ పోటీలు జరగనున్నాయి.



# బీసీ రిజర్వేషన్ల బంద్ పై భిన్నాభిప్రాయాలు

**నారాయణఖేడ్ అక్టోబర్ 16 (సిరి న్యూస్):** తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఈనెల 18న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సిపిఐతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడంతో, అసలు ఎవరిపై నిరసన అన్నది ప్రశ్నగా మారింది. న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అడ్డంకులే రిజర్వేషన్లకు ప్రధాన సమస్యగా విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వం బిల్లు చేసి గవర్నర్, రాష్ట్రపతుల ఆమోదం పొందినా, కోర్టులు వాటిని చెల్లుబాటు కాదని తీర్పు ఇచ్చాయి. రాజకీయ అంశం కాకుండా న్యాయ పరిమితులే అడ్డుకట్టగా ఉన్నాయని, బంద్‌తో ప్రజలకు ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం




**జహీరాబాద్ అక్టోబర్ 17 (సిరి న్యూస్)** ప్రభుత్వ డిగ్రీ కళాశాల జహీరాబాద్ ఎన్ ఎస్ ఎస్ యూనిట్ II ప్రత్యేక శిబిరాన్ని హుగ్గెలి గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జహీరాబాద్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ అస్లాం ఫారోఖి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎన్. ఎస్. ఎస్. యూనిట్ II ప్రోగ్రాం ఆఫీసర్ ప్రీతీ, కళాశాల అధ్యాపకులు డాక్టర్ లచ్చయ్య, డాక్టర్ సురేందర్, రాములు, మసారత్, జోహ, ఇషరత్ మరియువాలంటీర్స్ పాల్గొన్నారు.

## ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులకు

# వ్యక్తిత్వ వికాస శిక్షణ






**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** సంగారెడ్డి పట్టణంలోని ఎస్వీ జూనియర్ కాలేజ్ నందు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ మార్గదర్శకుడు మోటివేషనల్ స్పీకర్ క్రియేటివ్ కృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో లక్ష్యాలను నిర్ణయించుకోవడం, క్రమశిక్షణ, సానుకూల ఆలోచన, ఆత్మవిశ్వాసం వంటి అంశాల పట్ల సానుకూల వివరణ ఇచ్చారు. విజయం అనేది ఒక్కరోజులో వచ్చే అద్భుతం కాదు, ప్రతిరోజూ చేసే చిన్న చిన్న ప్రయత్నాల ఫలితం విజయం అని పేర్కొన్నారు. ఫలితాలకు భయపడకుండా, ముందుకు సాగాలని, ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, దానిని అభివృద్ధి చేసుకోవాలని ఆయన ప్రోత్సహిస్తూ విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఎస్వి కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి మోటివేషనల్ కార్యక్రమాలు విద్యార్థులు, ఉత్సాహాన్ని, ఆత్మహత్య, విశ్వాసానికి పెంపొందించి వారి ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయి. కృషి నిబద్ధత ఉంటే ఎంతటి కార్యమైన సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కళాశాల విద్యార్థులు సిబ్బంది పోషకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులలో నూతన ఆలోచనలు, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఉత్సాహాన్ని రేకెత్తించేలా కార్యక్రమం కొనసాగింది.

# ఉద్యోగ విరమణ పొందిన వారికి చట్టాలపై అవగాహన




**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్):** జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి.భవానీ చంద్ర ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విరమణ పొందిన ఉద్యోగుల సంఘం, సంగారెడ్డి ప్రాంగణంలో చట్టలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సమావేశంలో బి.సౌజన్య మాట్లాడుతూ ప్రతి వృద్ధ పౌరుడు తన హక్కులను తెలుసుకుని, అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందడం ద్వారా న్యాయ పరిరక్షణ పొందవచ్చు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సేవనివృత్తులైన ఉద్యోగులకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, మార్గదర్శకాల ప్రకారం అందించబడుతున్న ఉచిత న్యాయ సహాయ సేవలు, మధ్యవర్తిత్వం, లోకాధాలత్‌ల ద్వారా వివాద పరిష్కారం, పింఛన్, సేవా ప్రయోజనాలు, మహిళా, వృద్ధుల హక్కులు, ఆస్తి వివాదాలు, వినియోగదారుల రక్షణ చట్టాలు వంటి అంశాలపై వివరించబడింది. వృద్ధుల హక్కులు, వారసత్వ సమస్యలు, ఆస్తి మోసాలు, ఆరోగ్య పింఛన్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు, సభ్యులు, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్):** సంగారెడ్డి జిల్లాలోని అన్ని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5 తరగతి నుండి 9వ తరగతి వరకు గల కాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఇస్నాపూర్ ప్రిన్సిపాల్ ఏం.జయలక్ష్మి వివరాలను తెలియజేశారు. బాలికలకు ఇస్నాపూర్, చిట్కుల్, రంజోల్, రాయ్ కోడ్, ఆందోల్, బాలురకు హత్నూర, నల్లవాగు, నారాయణఖేడ్, సింగూరు, కొండాపూర్, న్యాల్ కల్ పాఠశాలలో అవకాశం ఉందందున ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్న వారు, ప్రవేశపరీక్ష రాసిన వారు, పరీక్ష రాయని వారు, ఆసక్తి గల వారందరూ తమ దరఖాస్తులను ఇస్నాపూర్ బాలికల పాఠశాలలో ఈనెల 22వ తారీకు మధ్యాహ్నం లోపు దరఖాస్తులను సమర్పించవలసిందిగా ప్రిన్సిపాల్ కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్ రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశం కల్పించబడుతుందని ఇస్నాపూర్ ప్రిన్సిపాల్ ఎం.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు.





# భవిష్యత్తులో విద్యార్థులకు సైన్స్ పట్ల భయాని పోగొట్టాలి

- **ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత శ్రీదేవి**

**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** భవిష్యత్తుల్లో సైన్స్ పట్ల విద్యార్థులకు ఉన్న భయాన్ని పోగొట్టాలన్న ఉద్దేశంతోనే హ్యాండ్స్ ఆన్ సైన్స్ కార్యక్రమానికి నిర్వహించినట్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు వాకిట శ్రీదేవి తెలిపారు. శుక్రవారం గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హ్యాండ్స్ ఆన్ సైన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యయరాలు అవార్డు అందుకున్న సందర్భంగా వచ్చిన నగదు పురస్కారాన్ని విద్యార్థులకు పరికరాలకు చేసినట్లు తెలిపారు.తను నమ్మేది జ్ఞానం అనంతం అది ప్రతిరోజు పరిణామం చెందుతూ ఎన్నో మార్పులకు లోనవుతూ ఎన్నో ప్రశ్నలను, సవాళ్లను మనకు విసురుతూ ఉంటుంది అని, ప్రకృతి గురించి మనకు తెలిసిన విషయాల్ని ఒక విధానం పూర్వక ప్రక్రియ ద్వారా తెలుసుకునే శాస్త్రం సైన్స్ అన్నారు. దాంట్లో పర్యవేక్షణ, ప్రయోగాలు, విశ్లేషణ, సిద్ధాంతాల తయారీ,అనే దశల ద్వారా జ్ఞానం రోజురోజుకు పెరుగుతూనే ఉండాలి అని తను ఒక సైన్స్ టీచరుగా విద్యార్థులలో పరిశీలన, ప్రయోగాలు నిర్వహిస్తూనే 2025 దసరా సెలవులలో సైన్స్ అకాడమీ హైదరాబాద్, కుటుంబంలో సభ్యురాలిగా చేరి 5 రోజుల శిక్షణను పొంది 37 సంవత్సరాల తన వృత్తి అనుభవానికి మరియు శిక్షణ పొందిన జ్ఞానాన్ని జోడించి పాఠ్యాంశాలలో (మేక గొర్రె) లంగ్స్, బ్రెయిన్, హార్ట్,కిడ్నీ ప్రత్యక్షంగా తెచ్చి డిసిక్షన్ చేస్తూ కాన్సెప్ట్లను వివరిస్తున్న క్రమంలోనే సైన్స్ అకాడమీ వారిని రప్పించడం జరిగిందని తెలిపారు. పాల్గొన్న సైన్స్ అకాడమీ హైదరాబాద్ ప్రాజెక్ట్ హెడ్ స్రవంతి , బయాలజీ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ డా. రేవతి, అసోసియేట్ ఫ్యాకల్టీ అమీర్ అలీ, ల్యాబ్ అటెండెంట్ సయ్యద్ షాదాబ్ పాఠశాల విద్యార్థులకు విద్యార్థుల లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి, పరిశీలన శక్తిని, ఆసక్తిని,అనురక్తి పెంపొందించే సైన్స్ భావనలను,కృత్యాలను,పరిశోధ నిర్వహించడం జరిగిం దని తెలిపారు. భవిష్య త్తులో సైన్స్ పట్ల వారికి ఉన్న భయాన్ని పోగొట్టి ప్రోత్సాహాన్ని అందించి, ప్రయోగము చేసి ఫలితాలు తెలుసుకునేలా విద్యా ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు.

# చిట్కుల్ గ్రామం మంచినీటి సమస్యను తీర్చండి

- **అధికారుల కోరిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ రాష్ట్ర నాయకులు దప్పురాజు**

**పటాన్ చెరు, అక్టోబర్ 17, (సిరి న్యూస్) :** పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామానికి గత 15 రోజులుగా త్రాగు నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ వైఎస్ ఆర్ సీపీ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ నాయకులు దప్పు రాజు ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడుతూ... గ్రామం తో పాటు పలు కాలనీల్లో సైతం నీటి ఇబ్బందులు ఉన్నాయన్నారు. త్రాగు నీరు లేక గ్రామ ప్రజలు, కాలనీ వాసులు, ఎంతో ఇబ్బందులు పడుతున్న అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపల్ అధికారులకు ఫోన్ చెస్తే రేపు... రేపు.... అంటూ సమాధానం దాట వేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు త్రాగునీరు రాక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిట్కుల్ గ్రామానికి మంచి నీరు సరఫరా చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా రాష్ట్ర మాజీ నాయకులు దప్పు రాజు, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# సేవా కార్యక్రమాలతోనే గ్రామాల అభివృద్ధి



- **సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి**
- **మంబాపూర్ గ్రామస్తులు గోవర్ధన్ రెడ్డి కి ఘన సన్మానం**

**గుమ్మడిదల రూరల్, అక్టోబర్ 17 (సిరి న్యూస్):** సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు తన వంతు సేవ కార్యక్రమాలను నిర్వహించాలని సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామస్తులు గోవర్ధన్ రెడ్డికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు తన వంతు సేవా కార్యక్రమాలని నిర్వహించాలని తెలిపారు ప్రజల నమ్మకం ప్రేమి నాకు ఈ స్థాయికి తీసుకు వచ్చిందని తెలిపారు. తన వంతు సహకారంగా గ్రామాల పట్ల అభివృద్ధి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నానని తెలిపారు. మంబాపూర్ గ్రామంలో పాఠశాల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆటో సౌకర్యం కల్పించడం జరిగింది అని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలకు అంత్యక్రియల సహాయ సహకారం తోపాటు బీదవారికి వివాహాలకు పుస్తెమెట్టలను సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గ్రామ కమిటీ అధ్యక్షులు చాకలి ప్రకాష్ గ్రామ పెద్దలు భాస్కర్ గౌడ్ సత్యనారాయణ కే రవి, వీరయ్య రాజు నీరుడి శ్రీనివాస్ యాట పెద్ద భాస్కర్ ఎం శ్రీనివాస్ టి.ప్రవీణ్ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీసీ బంద్‌కు మద్దతు, బీసీ బంద్‌కు విజయవంతం చేయాలి

- **ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** బీసీ వర్గాల హక్కుల సాధన కోసం ఈనెల 18వ తేదీన చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు బిఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది. జిల్లా ప్రజలు బంద్ ను విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్రవ్యాప్త బంద్ ఒక శాంతియుత నిరసన రూపమని, బంద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల శ్రేయస్సు కోసం పోరాటం కొనసాగుతుందని, సమాజ అభివృద్ధి కోసం ఇది ఒక ఆవశ్యక దశ అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బీసీ సమాజ ఐక్యతను చాటాలని ఆయన అభిప్రాయపడ్డారు. బీసీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ మద్దతు కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# టపాకాయల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

- **అనుమతి లెకుండా టపాకాయల దుకాణం పెడితే కఠిన చర్యలు తప్పవు**
- **మున్సిపల్ కమిషనర్ ఏ రవీందర్**



**ఆందోల్ అక్టోబర్ 17 (సిరిన్యూస్) :** ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో దీపావళి పండగ సందర్భంగా టపాకాయల విక్రయించి దుకాణములకు అనుమతి తప్పనిసరి అని కమిషనర్ ఏ రవీందర్ అన్నారు. అట్టి దుకాణం డ్రా పద్ధతిలో అనుమతులు ఇవ్వడం జరుగుతుందని , షాపు యజమానులు నిబంధనలను పాటిస్తూ టపాకాయలు విక్రయాలు జరుపుకోవాలని నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. దుకాణం యజమాని పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, నెంబర్లను కలిగి ఉండాలని ఏమైనా ప్రమాదము సంభవించినప్పుడు తీవ్రతను తగ్గించుటకు అవసరమైన నీరు మరియు ఇతర సామాగ్ని కలిగి ఉండాలని కమిషనర్ ఏ రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటైజర్ ఇన్స్పెక్టర్ వినయ్, ఆర్ఐ నారాయణ, ప్రాతిమా, లక్ష్మినారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కారులో ఉన్న నగదు చోరీ



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కొరకు వచ్చిన వ్యక్తికి సంబంధించిన డబ్బును తన కారులో ఉంచారు. అది గమనించిన దొంగలు కారు అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న డబ్బును దోచుకెళ్ళిన ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఆవరణలో చోటుచేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయకుమార్ తెలియ జేసిన వివరాల ప్రకారం పటాన్చెరు మండలం బీరంగూడ గ్రామానికి చెందిన ఎల్లబోయిన శ్రవణ్ కుమార్ టిఎస్ 02 ఈహెచ్1123 నెంబర్ గల ఫోర్డ్ ఫిగో కారులో 1,50,000 నగదు ఉంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. తన పని ముగించుకుని సాయంత్రం తిరిగి తన కారు వద్దకు 3:30 సమయంలో తిరిగి వచ్చి చూసేసరికి కారు అద్దాలు పగలగొట్టి, కారులో ఉంచిన ఉన్న నగదు చోరీ అయినట్లు గుర్తించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేసారు.



- బదిలీ చేయకుంటే బడి మానేస్తాం
- విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయుడే గతి తప్పితే
- సంఘాల పేరు చెప్పి బెదిరింపులు
- డీఈఓ మాటలు బేఖాతర్
- పాఠశాల ముందు ధర్నా చేపట్టిన విద్యార్థులు , తల్లిదండ్రులు
- కొట్టడం తప్ప ..చెప్పడం రాని ఫిజిక్స్ సారు
- విద్యార్థులను విద్యార్థులతో కొట్టిస్తున్న వైనం
- పాఠాలు చెప్పకుండా ఫోన్ లో కాలక్షేపం
- ప్రధానోపాధ్యాయూన్నే పరేషాన్ పెడుతున్న సారు
- కలెక్టర్ స్పందించి బదిలీ చేయాలి
- మాజీ సర్పంచ్ సమక్షంలో బదిలీ చేయాలని వినతి పత్రం అందజేత

# ఈ సైకో టీచర్ మాకొద్దు

**కౌడిపల్లి అక్టోబర్ 17 ( సిరి న్యూస్) :** విద్యార్థులను ఒకరిచేత ఒకరిని కొట్టించడం, అబ్బాయిలను అమ్మాయిలతో కొట్టిస్తాననడం పాఠాలు చెప్పకుండా సెల్ఫోన్ చూడడం విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించడం ప్రధాన ఉపాధ్యాయిని లెక్క చేయక పోవడం , డీఈవో చెప్పినా... తీరు మార్చుకోకపోవడం దీంతో విసిగిన విద్యార్థులు ఈ సైకో సారు మాకొద్దంటూ పాఠశాల ముందు ధర్నా చేపట్టారు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పనిచేస్తున్న ఫిజిక్స్ టీచర్ మాకొద్దంటూ పాఠశాల ముందు శుక్రవారం పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి పాఠశాల గేటు ముందు బైఠాయించి టీచర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ తల తిక్కల సారు మాకొద్దంటూ విద్యార్థులు విస్మయం వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటల పాటు పాఠశాల గేటు ముందు బయట నుంచి ధర్నా చేపట్టారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని భీష్మించుకు కూర్చున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ శ్రీకాంత్ సార్ ప్రవర్తన బాగాలేదని విద్యార్థులతో సైకోల వ్యవహరిస్తారని అన్నారు. ఈ సారుకు కొట్టడం తప్ప చదువు చెప్పడం రాదని అన్నారు. తరగతిలో విద్యార్థులను మరొక విద్యార్థితో కొట్టిస్తారని దీంతో సంతోష్ అనే విద్యార్థికి వేరొక విద్యార్థితో కొట్టించడంతో కళ్ళ భాగంలో వాచిపోయిందని అన్నారు. గతంలో జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేస్తే పాఠశాలను సందర్శించి ప్రవర్తన మార్చుకోవాలని సూచించినప్పటికీ సారు మాత్రం ఎప్పటి లాగే ప్రవర్తిస్తున్నాడని అన్నారు. పాఠాలు సరిగా బోధించడని మండిపడ్డారు .వెంటనే ఇలాంటి సారును మా పాఠశాల నుండి బదిలీ చేసి పంపించాలని వేడుకున్నారు. ఇదే విషయమై ప్రధానోపాధ్యాయులు శేషాద్రి కుమార్ ను వివరణ కోరగా సదరు ఉపాధ్యాయుడు పాఠశాలలో పనులను పక్కకు పెట్టి తనకు నచ్చిన విధంగా వ్యవహరిస్తాడని అన్నారు. పలుమార్లు ప్రవర్తన మార్చుకోవాలని సూచించినప్పటికీ ఎలాంటి మార్పు లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల పేరు చెప్పి పనులు తప్పించుకొని బెదిరింపులకు పాలు పడతాడని అన్నారు. ధర్నా వద్దకు గ్రామ మాజీ సర్పంచ్ దివ్య మహిపాల్ రెడ్డి చేరుకొని జిల్లా విద్యాధికారితో ఫోను లో మాట్లాడి వెంటనే పాఠశాల నుండి శ్రీకాంత్ టీచర్ ను బదిలీ చేయాలని సూచించారు వినతిపత్రం గ్రామస్తులు తో కలిసి ప్రిన్సిపాల్ కు అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు, యువకులు ,పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# అస్త్ర 2025 జాతీయ స్థాయి పోటీలు

- పోటీలో ఇంజనీరింగ్ సృజనాత్మకత, ఆవిష్కరణ ప్రతిభ వెలికితీత



**నర్సాపూర్ అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** ఈ రోజు బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BVRIT) లో ASTHRA 2025 జాతీయస్థాయి ఇంజనీరింగ్ సృజనాత్మకత, ఆవిష్కరణ ప్రతిభ పోటీలను ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే ప్రారంబించారు ఈ కార్యక్రమంలో దూబే మాట్లాడుతూ ఈ పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు. ఈ రసాయనిక రియాక్షన్ కార్ పోటీలు తొలిసారి తెలంగాణలో జరుగుతున్నాయని అన్నారు. ఉత్కృష్టమైన ఆవిష్కరణ , అద్భుతమైన ఇంజనీరింగ్ ప్రతిభ ప్రదర్శించేందుకు విద్యార్థులకు బి వి ఆర్ ఐ టి కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అస్త్ర - 2025 జాతీయ స్థాయి పోటీలు 17, 18 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహిస్తోందని చెప్పారు. దేశంలోని ప్రముఖ విద్యాలయాల విద్యార్థులు తమ సృజనాత్మకత, సాంకేతికత, ఇంజనీరింగ్ ప్రతిభ, జట్టు సమిష్టి కృషి ప్రదర్శించేందుకు బి వి ఆర్ ఐ టి నర్సాపూర్ క్యాంపస్ లో పోటీపడుతున్నారు.ఈ పోటీల్లో ప్రధాన ఆకర్షణ React-O-Car, ఇందులో జట్లు, రసాయన , ఎలక్ట్రో కెమికల్ ప్రతి స్పందనలతో నడిచే మోడల్ కార్లు రూపొందించడానికి సవాలు ఉంటుంది. Tech-O-car, ఇందులో ఎలక్ట్రానిక్స్ మెకానికల్ ఇంటిగ్రేషన్ మీద ఆధారపడి ఆవిష్కరనాత్మక మోడల్ కార్లను రూపొందించే డిజైన్ ఛాలెంజ్. Model Marvels, ఇది ఒక సృజనాత్మక మోడల్ తయారీ పోటీదారులు తమ ఇంజనీరింగ్ నైపుణ్యాలు ఉపయోగించి సమస్యల పరిష్కార మోడల్స్ ప్రదర్శిస్తారు. CheмAura, ఇందులో పజిల్స్ క్విజ్ , సుజనాత్మక పోటీలు ఉంటాయి.

కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ, “ఈ పోటీలు నిర్వహించడం శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కె వి విష్ణు రాజు కల అని, రెండు సంవత్సరాలుగా కష్టపడి, ప్రణాళికతో అధ్యాపకులు , విద్యార్థులు ఈ పోటీని నిర్వహిస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. ASTHRA 2025 ఒక సృజనాత్మక, సాంకేతిక , జట్టు సమిష్టి కృషి పోటీ. ఇందులో పాల్గొన ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ మరింత నేర్చుకొనే అవకాశం పొందుతారని తెలిపారు ప్రొఫెసర్ G B రాధిక మాట్లాడుతూ, యూనివర్శిటీ ఆఫ్ మిచిగన్ ప్రొఫెసర్ హెచ్. స్కాట్ ఫోగ్లర్ AICHEలో కెమ్ ఇ కార్ పోటీని 1999 లో ప్రారంభించారని, ఇది క్లాస్రూమ్ బోధనను ప్రాక్టికల్ అప్లికేషన్ గా మార్చడానికి ఉపయోగపడుతుంది. దీని నుండి స్ఫూర్తి తీసుకుని కె. విష్ణు రాజు మమ్మల్ని మార్గనిర్దేశం చేసి, ఈ పోటీలను నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించారని అన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగ అధిపతులు ఫాకల్టీ మెంబెర్స్, డిపార్ట్మెంట్ అధ్యాపకులు, డిన్స్, హెచ్ వో డి లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను
# పరిశీలించి పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ



**కొల్చారం అక్టోబర్ 17,( సిరి న్యూస్) :** భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కో ల్చారం మండల కేంద్రం లోనీ తహసీల్దార్ కార్యా లయాన్ని అకస్మాత్తుగా తనిఖీ చేశారు. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను, భూ రికార్డులను, హాజరు పుస్తకాల్ని పరిశీలించారు. వివిధ భూ సమస్యలతో తహసీల్దార్ కార్యాలానికి వచ్చిన భూ బాధితులతో మాట్లాడారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారాన్ని సూచించాలన్నారు. భూ సమస్యల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# సామాన్యునికి ఫలితాన్ని ఇవ్వని పరిశోధన వ్యర్థం

- రెండేళ్లలో బీఆర్ఎస్ అధికారంలోకి
- హ్యూవెల్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ నూతన ల్యాబ్ ను ప్రారంభించి, ఆర్టిపిసిఆర్ కిట్టును ఆవిష్కరించిన కేటీఆర్

**అమీన్ పూర్, అక్టోబర్ 17, (సిరి న్యూస్) :** అమీన్ పూర్ మున్సిపల్ పరిధి సుల్తాన్పూర్ మెడికల్ డివైస్ పార్క్ లోని లైఫ్ సైన్స్ పరిశ్రమ ఏర్పాటుచేసిన నూతన ల్యాబ్ ను ప్రారంభించి వారు తయారు చేసిన ఆర్టిపిసిఆర్ కిట్ ను పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేటీఆర్ కి పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ సామాన్యులకి ఫలితాన్నివ్వని పరిశోధన వ్యర్థమని తమ నాయకుడు కేసీఆర్ అనేవాడని, ఒకప్పుడు మన దేశంలో వైద్య పరికరాలు దాదాపు 80 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వాళ్ళమని, కానీ ఇప్పుడు మనదేశంలోనే మెడికల్ పరికరాలను తయారు చేయాలని కెసిఆర్ దృఢనిశ్చయంతో మెడికల్ డివైస్ పార్కును సుల్తాన్ పూర్ లో ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు, ఒకప్పుడు ఈ పరిసరాలలో రాళ్ల క్రషర్లు, గుట్టలు, ముళ్ళపొదల్లు ఉండేవని కానీ ఇప్పుడు చూస్తుంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో నూతన వరవడిని చూపిస్తూ అతి సామాన్యులకు అందుబాటులో ఉండే కొత్త కొత్త వైద్య పరికరాలను ఇక్కడ తయారు చేయడం చాలా సంతోషంగా ఉందని కొనియాడారు, ఈ క్రమంలోనే రాబోయే రెండు సంవత్సరాల తర్వాత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు మరింత అభివృద్ధి చేసుకుందామని జోష్యం చెప్పారు, కాగా ఆవిష్కరణ కోసం వచ్చిన కేటీఆర్ ను పటాన్చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా పార్టీ నాయకులు కార్యకర్తలు హరాలి వచ్చి కేటీఆర్ ను కలిసి శాలువాలు పూలమాలతో ఘనంగ సన్మానించారు, ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొన్నారు.




# దీపావళి పండుగ వ్యాపారం ఎలా ఉంది ?

- చిరు వ్యాపారులను పలకరించిన జగ్గారెడ్డి





**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** దీపావళి పండుగ సందర్భంగా ప్రమిదలు, బొమ్మలు, పూలు అమ్ముతున్న చిరు వ్యాపారులతో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట- ముచ్చట జరిపారు. దీపావళి పండుగ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ఐబి గెస్ట్ హౌస్ సమీపంలో పండుగ కోసం ఉపయోగించే బొమ్మలు, ప్రమిదలు, పూల దుకాణాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం జగ్గారెడ్డి ఐబి నుండి వెళ్తుండగా చిరు వ్యాపారులకు చూసి కాసేపు ఆగి వారితో ముచ్చటించారు. బొమ్మలు, ప్రమిదలు ఎక్కడి నుండి తీసుకువస్తున్నారు? రోజూ ఎంత గిరాకీ అవుతుంది. ఎంత గిట్టుబాటు అవుతోంది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. చివరగా వారి వద్ద నుండి బొమ్మలు, ప్రమిదలు కొనుగోలు చేశారు.



# బీఆర్ గవాయ్ పై దాడిని సహించబోం



**జహీరాబాద్ అక్టోబర్ 17 (సిరి న్యూస్)** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నిర్వహించినటువంటి నిరసన ధర్నాకు ముఖ్య అతిథిలుగా హాజరై అలిగి సందీప్ నాయ్యవాది మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్ గారి మీద రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కాలిబూటు విసిరేయడాని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది కేవలం గవాయి మీద జరిగిన దాడి కాదు ఇది దేశ రాజ్యాంగన్నీ అనుసరిస్తున్న ప్రతి ఒక్కరి మీద జరిగిన దాడి అని జడ్జిల మీద ప్రధాన న్యాయమూర్తుల మీద చెప్పులు బూట్లు విసిరేసినటువంటి చరిత్ర ఇంతవరకు దాఖలు కాలేదు కేవలం బిఆర్ గవాయ్ గారు దళితులు కాబట్టే ఈ దాడి జరిగిందని ఇది ముమ్మాటికి రాజ్యాంగంపై ప్రజాస్వామ్యస్ఫూర్తిపై జరిగిన దాడిగా సమాజమంతా గ్రహిస్తుంది.. ఢిల్లీ పోలీసులు ఈ కేసును సుమోటోగా స్వీకరించి లోతైన విచారణ చేపట్టి ఈ దాడికి పాల్పడ్డ ఆ న్యాయవాదిని మరియు ఈ దాడి వెనకాల ఉన్న రాజ్యాంగ విద్రోహ శక్తులను గుర్తించి సమగ్ర విచారణ చేపట్టి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు పునరవృతం కాకుండా పకడ్బందీగా చట్టాలను రూపొందించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జహీరాబాద్ తహసీల్దార్ దశరథ్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అరుంధతి సంఘం అధ్యక్షులు వరాల్,జైరాజ్, ఆనంద్,సుధీర్ బండారి బిజెపి రాష్ట్ర నాయకులు, సురేష్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీకాంత్ ముదిరాజ్ టిఆర్పి జహీరాబాద్ ఇంచార్జ్, బాల్రాజ్ సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు,జాన్ మాదిగ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జి,ఆహ్మద్ వికలాంగుల సంఘం నాయకులు,జై రాజ్ మాదిగ ఎంఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు, పద్మారావు ఎంఎస్, పి సహాయ కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ వివిధ మండల అధ్యక్షులు మైఖేల్, నిర్మల్, టింకు, ప్రభాకర్, సుకుమార్, సునీల్,పుట్రాజ్, జేమ్స్, ప్రేమ్, ప్రవీణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు తెలంగాణ బంద్



**జహీరాబాద్ అక్టోబర్ 17 (సిరి న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ల ను అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బి ర్ స్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు,మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు, జహీరాబాద్ శాసనసభ్యులు కొన్నింటి మాణిక్ రావు డీసీఎంస్ చైర్మన్ శివకుమార్ ఆదేశాల మేరకు 18న రాష్ట్ర వ్యాప్త బంద్ కార్యక్రమాన్ని బి ర్ స్ పార్టీ ఆధ్వర్యంలో రేపు మన జహీరాబాద్ మండలం ల్లో అన్ని ప్రభుత్వ ప్రవేటు విద్యా సంస్థలు.అన్ని ప్రభుత్వ. ప్రవేటు కార్యాలయాలు. కిరాణం సూపర్ మార్కెట్స్.బస్సులు.ఆటోలు వాణిజ్య సంస్థలు.హోటల్స్ ధాబా పెట్రోల్ పంపులు మొదలగు అన్ని.బంధు చేయగలరు.ప్రతి ఒక్కరూ మన జహీరాబాద్ లో బంద్ ను సంపూర్ణంగా పాటించి విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము. ఈ బంద్ కార్యక్రమానికి బి ర్ స్ పార్టీ ముఖ్య నాయకులు రేపు ఉదయం 09:00గలకి. భవాని మందిర్ చౌరస్తా దగ్గరకు రాగలరు అని తెలియజేయడం జరిగింది.

# ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అరెస్టు చేయాలి



- ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దప్పు శివరాజ్ మాదిగ

**చేగుంట అక్టోబర్ 17,సిరి న్యూస్) :** చేగుంట పట్టణ కేంద్రం లో ఎస్సీ కాలిని లో ఉంటున్న కుర్ర మల్లేష్,పోచమ్మ, రాంపురం భాస్కర్ కొడుకు బర్త్డే సందర్భంగా తన ఇంటి పరిధిలోని బర్తడే ఉత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో చేగుంట ఆర్ఎస్ఎస్ కార్యక ర్తలైన సోమ సురేష్, సోమ వెంకటి తదితరులు బర్త్డే సెలబ్రేషన్ జరుపుకుంటున్న వారి ఇంటికి వెళ్లి ఇతర దేశాలకు చెందినటువంటి క్రిస్టియన్ మతాన్ని ఎందుకు ప్రోత్సహిస్తు న్నారని,తీవ్రంగా బెదిరిస్తూ నానా మాటలు తిడుతూ మీరు భారతదేశ మనుషులు, కారా,మీరు క్రిస్టియన్ మతాన్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నారని, వారిని బెదిరిస్తూ, వారిని.జైశ్రీరామ, భారత్ మాతాకీ జై అనాలని బెదిరిస్తూ దౌర్జన్యంగా వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించిన తిరును,దళిత బహుజన సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని,తక్షణం పోలీసులు స్పందించి వారి పైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు, దాడిక పాలు పడిన వారికి దళిత బహుజన సంఘాలు ఏకమై,కార్యచరణ రూపొందించుకొని నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు తెలియచేశారు, ఈ కార్యక్రమంలో. దప్పు శివరాజ్ మాదిగ ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్. ఎర్ర యాదగిరి మాదిగ, జాతీయ కార్యదర్శి, కొలుపుల స్వామి మాదిగ రాష్ట్ర కార్యదర్శి, తొంట దుర్గాప్రతి ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, బక్క దశరథ, బుర్ర ఆగమయ్య మాదిగ తదితరులు పాల్గున్నారు.

# క్రీడలు ఆత్మవిశ్వాసాన్నిపెంపొందిస్తాయి



**మెదక్ అక్టోబర్ 17(సిరిన్యూస్) :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్ వెస్లీ ఉన్నత పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన టువంటి జిల్లా స్థాయి క్రీడలు అండర్ 17 మరియు 14 సంవత్సరాల లోపు బాలికలకు ఖో ఖో పోటీలు అట్టహాసంగా జరిగాయి.21 మండలాల నుండి మొత్తం 420 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్ మానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ హాజరై విజేతలకు బహుమ తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న రోజులలో క్రీడలు ఎంతో అభివృద్ధి చెందుతాయని క్రీడాకారులకు ఎంతో భవిష్యత్తు ఉన్నది అన్నారు.ఇటీవల ఎంపికైన ఐపీఎస్ అధికారిని సైతం క్రీడాకారులని స్ఫూర్తిగా తీసుకున్నారన్న విషయాన్ని గుర్తు చేశారు.మీ ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి బలమైన అస్త్రాలు. ఖోఖో ఆటలో వేగం మాత్రమే కాదు జట్టు భావన, సమన్వయం, ఆత్మవిశ్వాసం కూడా ముఖ్యమైనవి. ప్రతి ఆటను మీరు గెలవాలనే ఉద్దేశ్యంతో కాకుండా, నేర్చుకోవాలనే ఉత్సాహంతో ఆడండి అని సూచించారు.ఎస్ జి ఎఫ్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఎంపికైన మెదక్ జిల్లా జట్టు ఇదే నెల చివరి వారంలో మెదక్ లో జరిగే ఉమ్మడి మెదక్ జిల్లా ఖో ఖో పోటీలలో పాల్గొంటారని అన్నారు. విజేతలుగా బాలికల 17 సంవత్సరాలు విభాగంలో ప్రథమ హవేలీ ఘనపూర్, ద్వితీయ పాపన్నపేట్,తృతీయ రామాయంపేట కాగా బాలికల 14 సంవత్సరాలు విభాగం లో ప్రథమ పాపన్నపేట్, ద్వితీయ మెదక్,తృతీయ చేగుంట జట్లు గెలుపొందాయి.ఈకార్య క్రమంలో రాష్ట్ర పి ఈ టి ల సంఘం కార్యని ర్వాహక అధ్యక్షులు ఎస్ నాగరాజు పీడీలు శ్రీని వాసరావు, శ్రీధర్ రెడ్డి రూపేందర్, దేవేందర్ రెడ్డి,హరీష్, నరేష్, రమేష్, వినోద్, రవి, కిరణ్, శ్రీను, దాసరి మధు, శిల్ప, సుజాత, శ్వేత, శారద, హరిత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# సాక్షిపై దాడులను ఖండించిన జర్నలిస్టులు

**మెదక్ రూరల్ అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** నకిలీ మద్యంపై వరుస కథనాలను రాసిన సాక్షి జర్నలిస్టుల తో పాటు ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్న, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంపై జర్నలిస్టులు మండిపడ్డారు. ధమన కాండను నిరసిస్తూ శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బస్‌డిపో సమీపంలో రాస్తారోకో నిర్వహించి,జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ,గత కొన్ని నెలలుగా ఏపీలో సాక్షిపై కక్షకట్టి పత్రిక స్వేచ్ఛను హరిస్తూ పోలీసులను అడ్డుపెట్టుకుని రాజ్యాంగాన్ని కాలరాస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛను హరించటమంటే ప్రజల భావప్రకటన స్వేచ్ఛను హరించినట్లే నన్నారు. ఏపీలో సాక్షి టీవీ ప్రసారాలను నిలి పివేతపై సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వానికి చివాట్లు పెట్టినా, సాక్షి ప్రధాన కార్యాలయంపై మూడు రోజులుగా దాడులు చేస్తూ సంపాదకుడికి నోటీసులు ఇవ్వటం,రాజ్యాంగ విరుద్ధమైనా ప్రశ్నలు సంధించటం ఆప్రభుత్వ వినాశనానికేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా దాడులు నిలిపి వేసి అకారణంగా పెట్టిన కేసులను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.లేనిచో యజమాన్యాలకు అతీతంగా జర్నలిస్టుల సత్తాఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్,సాక్షి జిల్లా ఇన్‌చార్జి నీలయ్య, సీనియర్ పాత్రికేయులు నాగరాజు,గోపాల్‌గౌడ్, వెంకట్‌గౌడ్,న ంరేందర‌రెడ్డి, మురళి,శ్రీనివాస్,లక్ష్మణ్, కృష్ణమూర్తి,మల్లేశం, ఊశయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నిక కోసం ఓటింగ్ లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**మనోహరాబాద్, సెప్టెంబర్ 17. సిరి న్యూస్) :** మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎన్నిక కోసం శుక్రవా రం వర్గల్ మండలం శాకారం గ్రా మంలో ఏఐసిసి నాయకురాలు జ్యోతి వద్దెర ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వ హించారు. ఈ ఎన్నికలలో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓటు హక్కు లో పాల్గొన్న వారు శ్రీనివాస్ గౌడ్, వెంకటేశం, రమేష్‌ముదిరాజ్, సత్యనా రాయణ, రాజు యాదవ్, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్. కృష్ణయ్యను కలిసిన మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు



**మెదక్ రూరల్ అక్టోబర్ 17, (సిరి న్యూస్) :** పార్లమెంటు సభ్యులు ఆర్.కృష్ణయ్యను మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మ్యాకల జయరాములు నేత మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ మేము చదువు కొనే రోజుల్లో బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో ఉండి చదువుకునే వారమన్నారు. ఈనెల 18న జరప తలపెట్టిన బీసీ బంధుకు మెదక్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అన్ని మండలాల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొని కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటించాలని,బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రతీ ఒక్క బీసీ బిడ్డ ఉద్యమం చేయాలని జయరాములు ప్రకటించారు.

# పత్తిపంట అమ్మకాలపై అవగాహన

**పెద్ద శంకరంపేట అక్టోబర్ 17 సిరి న్యూస్) :** పత్తి పంటల అమ్మకంపై పెద్ద శంకరంపేట మండల వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని శివాయిపల్లి గ్రామంలో పత్తి పంట రైతుల తో మాట్లాడుతూ దళారుల చేతిలో పడి మోస పోవద్దని. పత్తి అమ్మడానికి తమ మొబైల్ లో కాటన్ కాపాస్ యాప్ కలిగి ఉండాలని పత్తి అమ్మే రైతులు మొబైల్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకొని నిర్దేశించిన తేదీలో సి సి ఐ కి వెళ్లి పత్తి అమ్ముకోవాలని సూచించారు అలాగే పత్తి పంట రైతులకు సంబంధించిన వివరాలు గ్రామ పంచాయతీలో ఉండడం జరుగుతుందని అన్నారు.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. పత్తి పంట రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు ఏఈఓ అఖిల్. మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ.. రైతులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



**కౌడిపల్లి అక్టోబర్ 17 ( సిరి న్యూస్) :** (ఎస్ జీ ఎఫ్ )మెదక్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలుర ఖో ఖో పోటీలు జిల్లా కేంద్రం లో శుక్ర వారంవెస్లీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 14 , అండర్ 17 విభాగంలో జిల్లాస్థాయి పోటీలో కౌడిపల్లి మండలం మహాత్మ జ్యోతిరావుపూలే తునికి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు. విద్యార్థుల విజయం పట్ల విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ టి.హరిబాబు పీడీ అంజలి పీఈటీ కార్తీక్ ,శేకర్ , పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు .

# చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తవద్దు

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ అక్టోబర్17(సిరిన్యూస్) :** చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే బాధ్యత డిడబ్ల్యూఓ సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరంలో డిడబ్ల్యు ఓ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఆరోగ్యం పై తల్లి, బిడ్డలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఇళ్లలో సహజసిద్ధంగా లభించే మునగ, కరివేపాకు వంటి ఆకు కూరలను ఆహారంలో చేర్చుకోవాలని, ఇవి శరీరానికి పుష్టి, శక్తిని అందిస్తాయని చెప్పారు.తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి అత్యంత శ్రేయస్కరమని, ఆహార అలవాట్లపై మహిళల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. గర్భిణీలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తగిన ఆహారం, పోషకాహారం గురించి విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి, వారిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువును ఎప్పటికప్పుడు పరిశీలించి ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి డబ్ల్యు అధికారి హేమా భార్గవి, సిడిపిఓలు, అధికారులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ట్రైని ఎంపీడీఓలు పర్యటన



**చేగుంట అక్టోబర్ 17 (సిరిన్యూస్) :** రాష్ట్ర స్థాహి గ్రూప్ వన్ ఫలితాల్లో ఎంపికై, ఎంపీడీవోలుగా శిక్షణ పొందుతున్న ట్రైనీ అధికారులు, చేగుంట మండలంలోని చిన్న శివనూర్ గ్రామాన్ని చేగుంట ఎంపీడీఓ చిన్నరెడ్డి తో కలిసి శుక్రవారం సందర్శించారు. శిక్షణలో భాగంగాగ్రామస్థాయి పరిపాలన విధానాన్ని పాటు పలు అభివద్ధి పనులను చూపించి గ్రామ స్థాయిలో అభివృద్ధి ఏ విధంగా ఉంటుందో ఎంపీడీఓ చిన్నరెడ్డి వారికీ వివరించారు. మండల అభివృద్ధి కొరకు అధికారులు ఏ అంశాలపై దృష్టి సారించాలి,గ్రామ పరిపాలన విధానాన్ని, ఏ విధంగా గ్రామాలను,అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాల గురించి, ట్రైని అధికారులకు ఎంపీడీవో చిన్న రెడ్డి వివరించారు. అనంతరం శిక్షణ పొందుతున్న ట్రైనీ ఎంపీడీవోలకు, చిన్న శివనూర్తో పాటు మండలం లోని పలు గ్రామాల్లోని నర్సరీలు, డంపింగ్ యార్డ్, విధి లైట్ల, తదితరల అంశాల పైన వారికీ అవగాహనా కల్పిచడం జరిగింది. ఎంపీవో సురేష్, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీ లు పాల్గొన్నారు.

# జీపీ కారోబార్ పై ఎంపీడీఓకు ఫిర్యాదు



**నార్సింగి, అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడని ఎంపీడీఓ ఆనంద్ కు ఇందిరమ్మ కమిటీ సభ్యులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ నార్సింగి లో 96 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 46 లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టారు. మిగతా 50 మంది కొన్ని కారణాల వల్ల నిర్మాణాలు మొదలు పెట్టలేక పోవడం తో మండల మేజర్ గ్రామ పంచాయతీ నార్సింగి లో కారోబార్ విధులు నిర్వహిస్తున్న కోనేరు వేణు ఇందిరమ్మ ఇల్లు రద్దు చేయిస్తానని బెదిరిస్తున్నారని తమకు పలువురు ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిర్మాణాలకు చివరి తేదీ అంటూ ఎలాంటి ఆదేశాలు లేవని, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను దెబ్బ తీసేలా ప్రజలను బెదిరిస్తూ, అబద్ధాలు చెబుతూ వ్యవహరిస్తున్న వేణు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ ను కోరామని తెలిపారు. గతంలో కూడా ఇందిరమ్మ కమిటి సభ్యుల సమక్షంలో మంజూరు అయిన ఇండ్ల విషయంలో ఆన్లైన్ లో అవకతవకలు చేశాడని, అందు వల్ల వాస్తవంగా అర్హులైన లబ్ధిదారులు నష్టపోయారని తమకు మౌఖికంగా ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం ఇళ్లు లేని పేదల సంక్షేమం కోసం ఇంటి నిర్మాణం లో చేయూత అందిస్తుంటే, కోనేరు వేణు ప్రభుత్వ ప్రతిష్ఠ ను దిగజార్చే లా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం లో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇష్టారీతిన వ్యవహరిస్తున్న వేణు పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ ఆనంద్ ను ఫిర్యాదు విషయమై వివరణ కోరగా వేణు పై తమకు ఫిర్యాదు అందిందని, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు అంచనూరి రాజేష్, ఈరప్ప యాదగిరి యాదవ్, బాచి స్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు చందూ యాదవ్, యేమికె రాజు, సంద నర సింహులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతపై అవగాహన




**వెల్దుర్తి అక్టోబర్ 17, ( సిరి న్యూస్) :** వెల్దుర్తి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ యందు నేటి నుండి 15 రోజులు పాటు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహించాలి అని విద్యాశాఖ ఆదేశానుసారం, మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ యందు మొదటి రోజు విద్యార్థుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి యందు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సాంబయ్య చేయించడం జరిగింది. పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచడమే స్వచ్ఛత పక్షోత్సవాల లక్ష్యం అలాగే చెత్త రహిత భారతదేశం పట్ల విద్యార్థులకు, సమాజానికి అవగాహన కల్పించటం, ప్రచారం చేయడం. స్వచ్ఛత పక్షోత్సవాల నినాదం - క్లీన్ ఇండియా బ్యూటిఫుల్ ఇండియా. అను నినాదంతో ప్రతి పాఠశాల యందు ఇట్టి కార్యక్రమాలు నిర్వహించాలి. అని ఇంచార్జ్ హెచ్చోడి సాంబయ్య తెలిపారు. అలాగే తరగతుల షెడ్యూల్ కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ డాక్యుమెంటేషన్ను నిర్వహిస్తామని కూడా తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఖాదిర్ పాషా,చార్లెస్, నర్సింహారెడ్డి, వెంకట్ రెడ్డి, రాము, జయసుధ, శైలజ, పద్మజ,రాధిక,సునీత, తదితర ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణ గో సేవ కార్యక్రమం




**మెదక్ రూరల్ అక్టోబర్ 17, (సిరి న్యూస్) :** జిల్లాస్థాయి గోవు పర్యావరణము పరిరక్షణ న్యాచురల్ ఫామింగ్ పై జిల్లాస్థాయిలో, లెవెల్ 1 2 మెదక్ క్రిస్టల్ గార్డెన్స్ లో వడ్ల జనార్దన్ మెదక్ జిల్లా గోసేవ విబాగ్ కన్వీనర్ అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ మెదక్ మంజీరా వనపర్తి వెంకటేశం, మల్కాజి సత్యనారాయణ, స్థానిక మెదక్ పట్టణ వైద్యులు ,డాక్టర్ పెంటా గౌడ్, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ బొల నాగభూషణం, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ గో సేవ ప్రాంత గో సేవ ప్రముఖ్ అయినటువంటి వెంకట నివాస్ , మెదక్ జిల్లా గో సేవ ప్రముఖ్ గేంట్యాల నాగ రాజు, తూప్రాన్, మెదక్ జిల్లా సంయోజక్ మెదక్ గోసేవా విభాగం ప్రాంత టోలి సభ్యులు గోశాల ప్రభాకర్ , ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్వి నివాజ్జీ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, గో ఆధారంగా పంచగవ్యలు గోదారితో ఉత్పత్తులు, గోవు వ్యవసాయం గో ఆధారిత ఉత్పత్తులు, వాటి ఉపయోగాల గురించి, కుటుంబ వ్యవస్థ లోని విలువలను, సీరియల్స్ లో వచ్చే అరాచకాలను మన పిల్లల పైన ఏ విధమైన ప్రభావం ఉంటుందో క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అనేక గ్రామాల నుండి జిల్లా నలవైపుల నుండి లెవెల్ 1, పరీక్ష పూర్తిచేసుకుని స్థానిక క్రిస్టల్ గార్డెన్స్ లో లెవెల్ 2 ,కు సుమారు 554 విద్యార్థిని విద్యార్థులు పరీక్షను రాశారు. ఇట్టి పరీక్షలో వారితో పాటు ఉపాధ్యాయులు, వారి కుటుంబీకులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. విశేషస్పందన విద్యార్థుల్లో కనిపించింది, 26/10/2025, నాడు భాగ్యనగరంలో కేశవ్ మెమోరియల్ కళాశాల నారాయణగూడ లో నిర్వహించే లెవెల్3 ,పరిక్షలకు 129 మంధి విద్యార్థిని విద్యార్థులు అర్హతను సాధించారు. ఇట్టి కార్యక్రమానికి తమ కుటుంబీకులతో కలిసి పరీక్షలకు హాజరు కావాల్సిందిగా వడ్ల జనార్దన్ మెదక్ జిల్లా గోవిజ్ఞాన పరీక్ష కన్వీనర్ తెలియజేశారు.

# బీసీ బంద్ కు సంపూర్ణ మద్దతు రాజిరెడ్డి



**నర్సాపూర్ అక్టోబర్ 17 (సిరి న్యూస్) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం శనివారం బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీ ఆవుల రాజిరెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించడానికి, వారికి న్యాయం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. బీసీ జేఏసీ చేపడుతున్న ఉద్యమం బిసి హక్కుల సాధన దిశగా ముందడుగని పేర్కొన్నారు.బీసీలకు తగిన గౌరవం, ప్రాధాన్యం రావాలంటే బీసిలకు 42 % రిజర్వేషన్ ఉండాలని అందరం ఒక్కటై బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని పిలునిచ్చారు.

# బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఉల్లాస్



- జోగిపేట లో మాదిగలు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన ర్యాలీ
- మాజీ కౌన్సిలర్ ప్రవీణ సంతోష్

**ఆందోల్ అక్టోబర్ 17 (సిరిన్యూస్) :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణమాదిగ పిలుపు మేరకు నిర్వహించినటువంటి నిరసన ధర్నా కు ముఖ్య అతిథిలుగా అలిగి సందీప్ హాజరై న్యాయ్యవాది మాట్లాడుతూ. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్ గారి మీద రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కాలిబూటు విసిరేయడాని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది కేవలం గవాయి మీద జరిగిన దాడి కాదు ఇది దేశ రాజ్యాంగన్నీ అనుసరిస్తున్న ప్రతి ఒక్కరి మీద జరిగిన దాడి అని జడ్జిల మీద ప్రధాన న్యాయమూర్తుల మీద చెప్పులు బూట్లు విసిరేసినటువంటి చరిత్ర ఇంతవరకు దాఖలు కాలేదు కేవలం బిఆర్ గవాయ్ గారు దళితులు కాబట్టే ఈ దాడి జరిగిందని ఇది ముమ్మాటికి రాజ్యాంగంపై ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన దాడిగా సమాజమంతా గ్రహిస్తుంది. ఢిల్లీ పోలీసులు ఈ కేసును సుమోటోగా స్వీకరించి లోతైన విచారణ చేపట్టి ఈ దాడికి పాల్పడ్డ ఆ న్యాయవాదిని మరియు ఈ దాడి వెనకాల ఉన్న రాజ్యాంగ విద్రోహ శక్తులను గుర్తించి సమగ్ర విచారణ చేపట్టి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు పునరవృతం కాకుండా పకడ్బందీగా చట్టాలను రూపొందించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అందోల్ తహసీల్దార్ కీ వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు భూచేంద్ర ,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ ఆశపాక ఇమ్మయ్య, మాదిగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీవోకి ఫిర్యాదు




**గుమ్మడిదల రూరల్ , అక్టోబర్ 17 ( సిరి న్యూస్) :** గ్రామంలోని సమస్యలను సక్రమంగా నిర్వహించడం లేదని గ్రామ ప్రజలు ఎంపీడీవో కి లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు శుక్రవారం గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాంబాబు గ్రామంలోని వివిధ సమస్యలను పంచాయతీ కార్యాలయానికి సక్రమంగా రాకపోవడం గ్రామ ప్రజల సమస్యలను సక్రమంగా నిర్వహించడం లేదని సర్పంచ్ శ్రీనివాస్ గ్రామ ప్రజలు కలిసి లిఖితపూర్వకంగా గుమ్మడిదల ఎంపీడీవో ఉమాదేవి కి ఎంపీఓ దయాకర్ రావు కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్ చాకలి ప్రకాష్ భాస్కర్ గౌడ్ సత్యనారాయణ కే రవి, వీరయ్య రాజు నీరుడి శ్రీనివాస్ యాట పెద్ద భాస్కర్ ఎం శ్రీనివాస్ టి.ప్రవీణ్ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ప్రణాళికబద్ధంగా పనిచేయాలి

- ఎంపీ రఘునందన్‌రావు
- బీజేపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీ




**గుమ్మడిదల రూరల్ , అక్టోబర్ 17 ( సిరి న్యూస్) :** భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయం ప్రారంభించిన ఎంపీ రఘునందన్ రావు శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ రఘునందన్ రావు కార్యాలయం ఎదురుగా బిజెపి జండా ఎగరవేసి నూతన కార్యాలయానికి రిబ్బన్ కత్తిరించి కార్యాలయాన్ని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త కార్యాలయం కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని అందించి ప్రజలకు మరింత చేరువ కావడానికి తోడ్పడుతుందని స్థానిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపుకు ప్రణాళికబద్ధంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కావలి ఐలేష్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోవర్ధన్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రాజిరెడ్డి కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి రాఘవ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్ర బంద్ ను విజయవంతం చేద్దాం

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డిబి నాగభూషణం



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర బంద్ తలపెట్టిన బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డిబి నాగభూషణం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పాటు విద్య,, చట్ట సభలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీ రాజ్యాధికారం సాధ్యం అవుతుందని ఆయన అన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక శాతం ఉన్న బీసీలను దృష్టిలో ఉంచుకొని జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. ఎన్నో ఏళ్లుగా రాజ్యాధికారానికి బీసీలు దూరంగా ఉన్నారు బీసీల న్యాయబద్ధ పోరాటానికి అన్ని వర్గాల సంఘాలు సహకరించాలని , విద్య, వ్యాపార, వాణిజ్య సంస్థలు, మద్దతు ఇవ్వాలని బిసి రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీలు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బిఆర్ఎస్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డిబి నాగభూషణం అన్నారు.

# బీసీ బందుకు భాజపా సంపూర్ణ మద్దతు

**మెదక్ అక్టోబర్ 17 (సిరిన్యూస్) :** ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్ కు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశినాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 1977 నుంచి బీసీలను అన్ని విధాలుగా మోసం చేస్తుందన్నారు. 1977లో ఎమర్జెన్సీ అనంతరం ఇందిరా గాంధీ ప్రభుత్వం ఓటమి పాలైన తర్వాత 1979 లో మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలను మోసం చేసింది. విద్యా, ఉద్యోగ, రాజకీయ చైతన్యం కోసం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి అభ్యున్నతి కోసం మొరార్జీ దేశాయి ప్రభుత్వం మండల కమిషన్ను ఏర్పాటు చేస్తే, పార్లమెంటేరియన్ బి.పి మండల్ గారిని మండల్ కమిషన్ చైర్మన్ గా నియమించడం జరిగిందన్నారు. ఈ కమిషన్ ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఇందిరాగాంధీ అల్లరులు సృష్టించి మొరార్జీ దేశాయ్ ప్రభుత్వాన్ని కూలదోసి, 1980లో ఇందిరాగాంధీ మళ్లీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించి బీసీ కమిషన్ బిల్లును తిరస్కరించిందన్నారు. 1984 ఇందిరా గాంధీ మరణాంతరం రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా అయినప్పటికీ బీసీ బిల్లును ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.1990 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు తిరస్కరించారు. అప్పుడు నేషనల్ ఫ్రంట్ కూటమి..ఆధ్వర్యంలో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా ఉండి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ను ప్రధానమంత్రిగా జనతాదళ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ మండల్ కమిషన్ స్వాగతిస్తూ బీ.పీ మండల్ ఇచ్చినటువంటి 11 సూత్రాల బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.ఇట్టి బిల్లుకు 85 మంది భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు పూర్తి మద్దతు ప్రకటిస్తే కాంగ్రెస్ మాత్రం.దేశ వ్యాప్తంగా అల్లరులు సృష్టించి దేశంలో కాంగ్రెస్ మాత్రమే ఉండాలి అనేటువంటి ఉద్దేశంతో విద్యార్థులను ఉసిగొలిపి విద్యార్థుల ఆత్మ బలిదానాలకు కారణమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ1980 లో జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ ఎస్టీలకు 22% బీసీలకు 27.5%శాతం ఉండాలి అనే నిబంధనతో ఇప్పటివరకు కొనసాగిస్తూ వచ్చిందన్నారు. కామారెడ్డి లో రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్ ను ఎలా అమలు చేస్తానని 42 శాతం ఎలా ఇస్తా అని చెప్పడం నిజం కదా అని దుయ్యాబట్టారు.బీసీల అభ్యున్నతికి అండగా ఉంటూ వారికి సామాజికంగా విద్యా వైద్య రాజకీయ చైతన్యం ఉద్యోగాల కోసం భారతీయ జనతా పార్టీ మాత్రమే పని చేస్తుందని బీసీ బందు కు సంపూర్ణ మద్దత్తు ప్రకటిస్తున్నామన్నారు. రాష్ట్ర బంద్ కు వ్యాపార వాణిజ్య వర్గాలు ప్రభుత్వ సంస్థలు బస్సులు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ చేయాలని ఈ బంద్ కు విద్యార్థి సంఘ నాయకులు వివిధ కుల సంఘాలు పూర్తిగా మద్దతు తెలిపాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ బిజెపి జిల్లా నాయకులు లోకేష్ అల్లం మధు. సుంకోజు రాజు. బుద్ది ఆంజనేయులు. సాయికుమార్ .సన్నీ భూపతి.ఓబీసీ పట్టణ అధ్యక్షుడు భాను తదితరులు పాల్గొన్నారు.